సాక్షి మంచిర్యాల

ఆదివారం । 17 । సెప్టెంబర్ । 2023

ఇద్దరు కానిస్టేబుళ్లపై వేటు ?

మంచిర్యాలక్రైం: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు కానిస్టేబుళ్లపై వేటు పడినట్లు సమాచారం. ఈ నెల 9న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ దివాకర్ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణల మేరకు రామగుండం సీపీ రెమా రాజేశ్వరి కమిషనరేట్‌కు అటాచ్ చేసినట్లు తెలిసింది. ఈ విషయమై స్థానిక సీఐ రాజును సంప్రదించగా.. తమకెలాంటి సమాచారం లేదని తెలిపారు.




రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి

కాసిపేట: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీ ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి పి.ప్రశాంత్ హైజంప్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య తెలిపారు.



వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.



- సాయుధ వీరులు.. ఈ ప్రాంత యోధులు
- నిజాం నిరంకుశ పాలనపై రాజీలేని పోరాటం
- జైలు శిక్షలు.. నిర్బంధాలనూ లెక్కచేయని వారెందరో
- చిరస్మరణీయం వారి పోరాటం
- నేడు తెలంగాణ విమోచన దినోత్సవం

కైలాస్‌నగర్: భూమి కోసం.. భుక్తి కోసం.. నిరంకుశ పాలన విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటం చరిత్రకు సజీవసాక్ష్యంలా నిలుస్తోంది. ప్రజలను కట్టు బానిసలుగా మార్చి, వారి హక్కులు హరించడం, మహిళలపై ఆకృత్యాలకు ఒడిగట్టడం, రైతుల భూములు లాక్కుని కూలీలుగా మార్చిన నిజాం పాలనలోని రజాకార్ల అరాచకాలు అన్నీఇన్ని కావు. దీంతో విసుగుచెందిన ఎంతో మంది యోధులు ఉద్యమబాట పట్టారు. అరాచక పాలనను ఎదిరించారు. తమ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా ఈ ప్రాంత విముక్తే లక్ష్యంగా పోరాడారు. దేశ్‌ముఖ్‌లు, జాగీర్దార్లు, భూస్వాముల కంబంద హస్తాల్లో చిక్కుకున్న వేలాది ఎకరాలను స్వాధీనం చేసుకుని పేదలకు పంచారు. ఈ క్రమంలో నిర్బంధాలు, జైలు శిక్షలకు వెరవకుండా అలుపెరుగని పోరుతో చరిత్రపుటల్లోకి ఎక్కారు. త్యాగాలకు స్మారకంగా నిర్మించిన స్తూపాలు, ప్రాంతాలు వారి పోరాటాన్ని గుర్తు చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో నాటి ఘట్టాలు, పోరాట యోధుల విజయగాథలివి.



వీరులారా.. వందనం

రైతాంగ పోరాటానికి ఆధ్యుడు.. రాంకిషన్ శాస్త్రి



కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లాలో కమ్యూనిస్ట్ పార్టీతో పాటు నిజాం పాలనకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ప్రారంభించిన వారిలో రాంకిషన్ శాస్త్రి ఆధ్యుడు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా నల్గొండ జిల్లాలో పనిచేసిన ఆయన సీపీఐ భావజాలానికి ఆకర్షితుడై పార్టీలో చేరాడు. ఈ క్రమంలో ఆయన్ను పార్టీ ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా నియమించింది. 1941లో జిల్లాకు వచ్చిన ఆయన సీపీఐ సభ్యత్వాన్ని ప్రారంభించాడు. కస్తాల రాంకిష్టు, దాజీ శంకర్, వన్నెల ఎల్లన్న, సదాశివ్ వంటి వ్యక్తులతో ఓ ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేశాడు. రైతుల నుంచి భూములను లాక్కుని కౌలు సైతం చెల్లించని రజాకార్ల వైఖరిని ఎండగట్టేలా రైతాంగ పోరాటానికి శ్రీకారం చుట్టాడు. రాత్రి పూట ప్రత్యేక పాఠశాల నడుపుతూ ప్రజలను చైతన్యవంతం చేశారు. 1948లో ప్రస్తుత భీంపూర్ మండలం బెల్సారీ రాంపూర్ గ్రామంలో అరెస్టయిన ఆయన 1952లో విడుదలయ్యారు.

శిక్షణలో దిట్ట.. రాంకిష్టు



కైలాస్‌నగర్: వెట్టిచాకిరీ, పీడిత వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వ్యక్తి కస్తాల రాంకిష్టు. ప్రజలను పోరాట దిశగా చైతన్యవంతులను చేశాడు. మహారాష్ట్రలోని చనాఖా గ్రామంలో నాడు ఉద్యమకారులకు శిక్షణ ఇచ్చే వ్యవహారాల్లో కీలకపాత్ర పోషించాడు. భూస్వామ్య కుటుంబానికి చెందిన రాంకిష్టు రజాకార్లు సాగించిన హింసాకాండకు చలించి ఉద్యమబాట పట్టాడు. కమ్యూనిస్టు భావజాలానికి ఆకర్షితుడైన ఆయన సీపీఐలో చేరాడు. ప్రజలను సంఘటితం చేసే కార్యక్రమాల్లో క్రియాశీలకంగా వ్యవహరించాడు. రెండేళ్ల జైలు జీవితాన్ని గడిపిన ఆయన విడుదలయ్యాక ఆదిలాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా విజయం సాధించాడు.

పోరుబాటలో బోథ్ బిడ్డలు

బోథ్: తెలంగాణలో సాయుధ పోరాటంలో బోథ్ చరిత్ర ఘనమైనది. ఈ ప్రాంతానికి చెందిన చట్ల శంకర్‌రావు, తక్కల చరణ్‌దాస్‌రెడ్డి, గుండెరావు, బొందిడి వెంకట్రావ్, ఎస్.లింగారెడ్డి, లక్ష్మణ్‌రావ్ సూర్య, పూంద్రు రాజిరెడ్డి, ప్రభాకర్‌రావ్‌తో పాటు చాలామంది సాయుధ పోరాటంలో పాల్గొన్నారు.

ఆర్నెళ్లు జైలులో చరణ్‌దాస్



నాడు రజాకార్లను గట్టిగా ఎదుర్కొన్న వారిలో తక్కల చరణ్‌దాస్‌రెడ్డి ఒకరు. మహారాష్ట్రలో సాయుధ శిక్షణ పొంది ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించాడు. 2015లో మృతి చెందాడు.

శిక్షణలో రాటుదేలిన 'బొందిడి'



ఆదిలాబాద్‌కు చెందిన కస్తాల రాంకిష్టు, మరో 30 మందితో కలిసి ఈయన చంద్రాపూర్‌లో సాయుధ శిక్షణ పొందాడు. రజాకార్లపై దాడులు చేయడంలో కీలకపాత్ర పోషించాడు. స్వాతంత్ర్యం అనంతరం వివాహం చేసుకున్నాడు. 1998లో మృతి చెందాడు.

నిజాంను కలిసి 'చట్ల' నిరసన



నాటి రజాకార్ల ఆగడాలు సహించలేక హైదరాబాద్‌లో నిజాంను కలిసి తన నిరసన తెలిపాడు చట్ల శంకర్‌రావు. ఈ క్రమంలో ఈయనను జైలులో బంధించాలని నిజాం ఆదేశించారు. దీంతో ఈయన 1947లో ఆసిఫాబాద్‌లో జైలు జీవితం గడిపారు.

పోరాటానికి గుర్తింపుగా స్తూపాలు, కాలనీలు

కైలాస్‌నగర్: సాయుధ రైతాంగ యోధుల పోరాటాలకు గుర్తుగా కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక స్తూపాలను నిర్మించారు. కాలనీలనూ ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లో సాయుధ పోరాట యోధుల పేర్లతో ప్రత్యేక శిలాఫలకం ఏర్పాటు చేశారు. కస్తాల రాంకిష్టు పేరిట కేఆర్‌కే కాలనీ, దాజీ శంకర్ పేరిట పెండల్వాడలో ఓ కాలనీ ఏర్పాటు చేశారు. అలాగే తాంసి మండలం ఈదుల్లాసావర్గాంలో దాజీ శంకర్, తిర్పెల్లి శ్మశాన వాటికలో కస్తాల రాంకిష్టు, భుక్తాపూర్‌లో రాంకిషన్ శాస్త్రీ స్తూపాలను నిర్మించారు.

ఆసిఫాబాద్ యోధులు

ఆసిఫాబాద్: నిజాం నిరంకుశ పాలన అంతమొందించేందుకు జరిపిన సాయుధ పోరాటంలో ఆసిఫాబాద్ సమరయోధుల పాత్ర కీలకమైనది. ఇండియన్ యూనియన్‌లో కలవడానికి ఈ ప్రాంత వాసులు అత్యంత కీలక పాత్ర పోషించారు. ఆసిఫాబాద్, సిర్పూర్‌కు చెందిన వేలాది మంది యువకులు కాంగ్రెస్ అతివాద నాయకుల నేతృత్వంలో 1947 సెప్టెంబర్ నుంచి నిజాం వ్యతిరేక పోరాటంలో దిగారు. పట్టణానికి చెందిన బోనగిరి వెంకటేశం, తాటిపెల్లి తిరుపతి, చీల శంకర్, చీల విఠల్, ఏకబిల్వం నాగేంద్రయ్య, ఖాడ్రే శంకర్, రాంసింగ్, రేవయ్య, తాటిపెల్లి తిరుపతి, ఏకబిల్వం శంకరయ్య, చందావార్ విఠల్, చిలుకూరి సీతారాం, జగన్నాథ్‌తో పాటు పలువురు యోధులు అజ్ఞాతంలోకి వెళ్లి మహారాష్ట్రలోని చాందా సాయుధ శిక్షణా శిబిరంలో ఏడాది పాటు శిక్షణ పొందుతూ వివిధ ఘటనల్లో పాల్గొన్నారు. వీరి ఉద్యమాలకు ఆసిఫాబాద్‌కు చెందిన రాంచందర్ రావు పైకాజి, సుబ్బారావు, దండనాయకుల గోపాల్‌కిషన్‌రావు, వామన్ రావు వైరాగరే, ప్రభాకర్ రావు మసాదే పరోక్షంగా సహకరించారు. వీరూర్ రైల్వేస్టేషన్ విధ్వంసం చేసిన ఘటన బోనగిరి వెంకటేశం కాలికి గ్రేనేడ్ తగిలి ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. నాటి పోరాటంలో పాల్గొన్న వారిని ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించింది.



సాయుధ పోరాటంలో పాల్గొన్న యోధులు (ఫైల్)

గాండ్రించిన నిర్మల్ గడ్డ..

- నిజాంకు వ్యతిరేకంగా ఉద్యమం
- 70 మందిని జైళ్లో పెట్టిన రజాకార్లు



తెలంగాణ విముక్తి కోసం పోరాడిన సమరయోధులు (ఫైల్)

నిర్మల్: ప్రథమ సాతంత్ర్య సంగ్రామానికి కొనసాగింపుగానే నిర్మల్‌గడ్డ గాండ్రించింది. సాధారణ అడవి బిడ్డలు రాంజీగోండు సారథ్యంలో నాటి పాలకులపై అసాధారణంగా పోరాడారు. చివరకు ఆ వెయ్యిమంది పోరువీరులు ఒకే మర్రిచెట్టుకు ఉరితీయబడ్డారు. నాటివీరుల ప్రాణత్యాగాల స్ఫూర్తితో తెలంగాణ విముక్తి కోసం సమరయోధులు కదంతొక్కారు. నైజాం, ఆంగ్లేయులతో పోరాడుతూ.. ఇళ్లు, పిల్లలకే కాదు ఏకంగా ఊళ్లకే దూరమయ్యారు. నెలల తరబడి ఎక్కడో దూరంగా ఉన్న జైళ్లల్లో మగ్గారు. తిండీతిప్పల్లేక లాఠీదెబ్బలు తిన్నారు.

నిజాం పాలనపై తిరుగుబాటు..

ఓవైపు దేశానికి 1947, ఆగస్టు 15నే స్వాతంత్ర్యం వచ్చినా మన తెలంగాణ ప్రాంతం మాత్రం నిజాం నిరంకుశత్వంలోనే 13 నెలలు మగ్గింది. ఈ కాలంలో జిల్లాకు చెందిన సమరయోధులు సంఘటితంగా నిజాం, రజాకార్ల ఆగడాలపై పోరు జరిపారు. నాటి నిర్మల్ పంచాయతీ సమితి పరిధిలో గోపిడి గంగారెడ్డి, గణపతి, బాపూరావు, బోరేగాం గజన్న, లాలు పటేల్, ఏ.రాజన్న, పోశెట్టి, గంగాధర్, శివన్న, గంగారామ్, విఠల్‌రావు, జమునాలాల్, వెంకోబరావు, గాంధారి చిన్న నర్సింహులు, లింగారెడ్డి, సుందర్‌రాజ్, ముడుసు ఎల్లయ్య, అర్గుల గంగాధర్‌గుప్తా, హన్మంత్‌రావుఠాకూర్.. ఇలా ఎంతోమంది సమరయోధులు పోరాడారు.

జైళ్లలో మగ్గి..

నిజాంపై పోరాటంలో నిర్మల్, భైంసా ప్రాంతాల్లో కలిపి వందకుపైగా సమరయోధులు ఉండేవారు. ఇందులో 73 మందిని గుర్తించి జైళ్లకు పంపించారు. మహారాష్ట్రలోని నాందేడ్, చంద్రాపూర్, ఔరంగాబాద్, నిజామాబాద్ వంటి దూర ప్రాంత జైళ్లలో ఉంచారు. 1948, సెప్టెంబర్ 17న పటేల్ సైన్యానికి నిజాం లొంగిపోయిన తర్వాతే ఇళ్లకు చేరారు.

నాడు పోరాట.. నేడు పర్యాటక కేంద్రం

చెన్నూర్: నాడు నిజాం సర్కారుపై సమరం సాగించేందుకు కేంద్ర బిందువుగా ఉన్న అద్దాల మేడ నేడు పర్యాటక కేంద్రంగా మారింది. 1901 బ్రిటిష్ కాలంలో అప్పటి కలెక్టర్ గ్లాస్‌ఫోర్డ్ తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని సిరొంచ ప్రాణహిత నది ఒడ్డున అద్దాల మేడను నిర్మించారు. ఆ మేడను ఇండియన్ మిలిటరీ సైనికులు స్థావరంగా ఏర్పర్చుకుని నిజాం సర్కార్‌పై పోరు సాగించారు. ఆనాటి అద్దాల మేడ నేటికీ చెక్కు చెదరలేదు. తెలంగాణ, మహారాష్ట్ర నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి పర్యాటకులు వస్తుంటారు.



మహారాష్ట్రలోని సిరొంచలో ఉన్న అద్దాల మేడ

జిల్లాకు అనుబంధం..

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం రాపన్‌పల్లికి మూడు కిలోమీటర్ల దూరంలోని ప్రాణహిత నది అవతలి ఒడ్డున సిరొంచలో ఉన్న అద్దాల మేడతో జిల్లా వాసులకు అనుబంధం ఉంది. ఆనాటి మద్రాసు ప్రెసిడెన్సీలో అప్పర్ గోదావరి జిల్లా కేంద్రంగా సిరొంచ ఉండేది. సిరొంచ జిల్లా పరిధిలో అప్పటి ఏపీలోని భద్రాచలం, ఖమ్మం, ఏటూరునాగారం, కరీంనగర్, మరోవైపు జన్నారం, లక్సెట్టిపేట వరకు విస్తరించి ఉంది. స్వాతంత్ర్యం అనంతరం రాష్ట్రాల విభజన తర్వాత భద్రాచలం, ఖమ్మం, ఏటూరునాగారం, కరీంనగర్, జన్నారం, లక్సెట్టిపేట ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కలిపారు. సిరొంచ మహారాష్ట్రలో భాగమైంది.

విశేషాలు..

- అద్దాల మేడ మూడంతస్తుల భవనం పైనుంచి చుట్టూ 15 కిలోమీటర్ల మేర కన్పిస్తుండడంతో శత్రువుల రాకను సైనికులు కనిపెట్టేవారు.
- భవనం లోపలి నుంచి సుమారు 10 కిలోమీటర్ల మేర సొరంగం ఉండేది. దీని ద్వారానే సైనికులకు ఆయుధాలు చేరుతుండేవని ప్రచారంలో ఉంది. ఇక్కడి నుంచి పోరాడిన ఇండియన్ మిలిటరీ సైనికుల్లో సుమారు 211 మంది స్వాతంత్ర్య సంగ్రామంలో తుది శ్వాస విడువగా వేలాది మంది రజాకార్లను మట్టి కరిపించారు.
- చెన్నూర్, నస్పూర్, కోటపల్లి మండలాల స్వాతంత్ర్య సమరయోధులు ఇండియన్ మిలిటరీ సైనికులకు రజాకార్ల కదలికలపై సమాచారం చేరవేసే వారని ప్రచారంలో ఉంది.

గవర్నర్ బస..

1947లో మద్రాసు గవర్నర్ పట్టాభి సీతారామయ్య ఈ భవనంలో బస చేశారు. హైదరాబాద్ నిజాం సర్కార్‌తో చర్చలు జరుపడానికి అప్పటి హోంశాఖ మంత్రి వల్లభాయ్ పటేల్ అద్దాల మేడకు వచ్చినట్లు సమాచారం. పీవీ నరసింహారావు సైతం అద్దాల మేడను సందర్శించిన ప్రముఖుల్లో ఉన్నారు.

ఉద్యమ శిఖరం.. కొండా లక్ష్మణ్



ఆసిఫాబాద్: నిజాం నిరంకుశ పాలనపై కొండా లక్ష్మణ్ బాపూజీ అలుపెరుగని పోరాటం చేశారు. ఆయన స్వస్థలం అప్పటి హైదరాబాద్ సంస్థానం ప్రస్తుత మహారాష్ట్రలోని రాజూర. పౌర విమోచనోద్యమంలో 1938లో తొలిసారి అరెస్టయ్యారు. 1941-42లో ఖద్దరు, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొన్నారు. 1947లో కింగ్‌కోఠి నుంచి బయటకు వచ్చిన నిజాం నవాబుపై బాంబులు విసిరిన ఘటనలో నిందితుడిగా ఉన్నారు. హైదరాబాద్ సంస్థాన్‌ను విలీనం చేయాలనే ఉద్యమంలో భాగంగా 13 సార్లు అరెస్టయ్యారు.

దళాల స్పెషలిస్ట్.. శంకర్



కైలాస్‌నగర్: రజాకార్లు సాగించిన వెట్టిచాకిరీ, రైతులను పీడించిన ఘటనలతో విసుగుచెందిన దాజీ శంకర్ వాటిని వ్యతిరేకిస్తూ ఉద్యమబాట పట్టాడు. కుచులాపూర్, తాంసి, తలమడుగు, ఆదిలాబాద్ మండలాల్లో పర్యటిస్తూ ప్రత్యేక దళాలను ఏర్పాటు చేశాడు. ఈయన పోరాట పంథాపై నిజాం పాలకుల నిఘా పెరగడంతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. రెండేళ్ల పాటు అజ్ఞాతం నుంచే ప్రజల ద్వారా పోరాటాన్ని నడిపించాడు. తన సొంత భూమి 350 ఎకరాలను పేదలకు పంచి సామాజిక బాధ్యతనూ చాటుకున్నాడు. 1947లో అరెస్టయి జైలుకు వెళ్లిన ఆయన 1952లో విడుదలయ్యాడు. అదే ఏడాది జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఘన విజయం సాధించారు.

జాగృతం చేసిన ఎల్లన్న



కైలాస్‌నగర్: రజాకార్లు సాగిస్తున్న దమనకాండకు వ్యతిరేకంగా ప్రజలను జాగృతం చేయడంలో తాంసి మండల కేంద్రానికి చెందిన వన్నెల ఎల్లన్న కీలక పాత్ర పోషించాడు. కళాకారుడైన ఆయన సీపీఐలో చేరి తన ఆటపాటల ద్వారా గ్రామగ్రామాన జనాన్ని పోగు చేసేవాడు. పోరుబాటలో అరెస్టయి జైలు జీవితం సైతం గడిపాడు.

ఆశ్రయం ఇచ్చిన లంబాడితండా

బెల్లంపల్లి: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, రజాకార్ల దాష్టీకాలపై పోరాటం సాగించిన తెలంగాణ రైతాంగ సాయుధ యోధులకు బెల్లంపల్లి మండలం లంబాడితండా ఆశ్రయమిచ్చింది. ఊరు ఊరంతా గుట్టు బయటపడకుండా గుండెల్లో దాచుకుంది. 1947 ప్రాంతంలో లంబాడితండా గ్రామం సుమారు వంద కుటుంబాలు 400 పైచిలుకు జనాభా కలిగి ఉండేది. సింగరేణి కార్మికులు, రైతులు, దినసరి కూలీల కలబోతగా ఉండేది. కమ్యూనిస్టు యోధులు బాసెట్టి గంగారాం, జె.కుమారస్వామి, పోతుగంటి పోశెట్టి తదితరులు బెల్లంపల్లి ప్రాంతాన్ని రహస్య స్థావరంగా ఏర్పాటు చేసుకుని సాయుధ పోరాటం చేశారు. గ్రామానికి చెందిన సుకాసి బాలయ్య, సుకాసి పోశం, సల్లం పోశం తదితరులు సాయుధ పోరాట వీరులకు నమ్మిన బంట్లుగా వ్యవహరించారు. జన్నారం, ఆసిఫాబాద్, ఉట్నూర్, లక్సెట్టిపేట, చెన్నూర్, సిర్పూర్(టి) తదితర ప్రాంతాల్లో భూ పోరాటాలు చేసి పేదలకు భూములు పంచారు. కుమురంభీం ఆచూకీని ఇన్‌ఫార్మర్ మాడావి కొద్దు పోలీసులకు అందించినట్లు కమ్యూనిస్టు దళం గుర్తించింది. అగ్ర నాయకత్వం ఆదేశాలతో తిర్యాణి ప్రాంతంలో అంతమొందించింది.



దళ నాయకులకు ఆశ్రయం ఇచ్చిన ఇల్లు (ఫైల్)

ప్రస్తుతం లంబాడితండా గ్రామం..

లంబాడితండా గురిజాల గ్రామ పంచాయతీలో అనుబంధ గ్రామంగా ఉండగా 2019లో గ్రామ పంచాయతీగా ఏర్పడింది. రెండేళ్ల క్రితం వరకు కమ్యూనిస్టు దళ నాయకులు ఆశ్రయం పొందిన ఓ ఇల్లు అప్పటి ఆనవాళ్లకు గుర్తుగా ఉండేది. అప్పటి తరం అంతరించడం, ఎదిగిన కొడుకులు ఉద్యోగం, బతుకు దెరువు వెతుక్కుంటూ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడంతో మట్టిగోడలు కూలిపోయి ఆనవాళ్లు లేకుండా పోయింది. గ్రామంలో కొందరు సింగరేణి కార్మికులు ఉండగా అనేక మంది వ్యవసాయ రైతులుగా, కూలీలుగా జీవిస్తున్నారు. పాల వ్యాపారం చేస్తున్నారు.

ప్రతీపౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవాలి

- ఎలక్ట్రోరల్ అబ్జర్వర్ అహ్మద్‌నదీం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో 18 ఏళ్లు నిండిన ప్రతీ పౌరుడు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని ఎలక్ట్రోరల్ అబ్జర్వర్ అహ్మద్‌నదీం అహ్మద్ నదీం అన్నారు. ఎలక్షన్ సెకండ్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్మల్ కలెక్టర్ వరుణ్‌రెడ్డి, మంచిర్యాల కలెక్టర్ సంతోష్, నిర్మల్ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, మంచిర్యాల అదనపు కలెక్టర్ రాహుల్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నదీం మాట్లాడుతూ ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు కొత్త ఓటర్ నమోదుకు మూడు రోజులే సమయం ఉన్నందున ఈఆర్వోలు ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలన్నారు. ఇందుకోసం ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నం చేయాలని సూచించారు. గడువు సమీపిస్తున్నందున చివరి నిమిషంలో ఎక్కువ మొత్తంలో దరఖాస్తులు వచ్చి ఇబ్బంది ఏర్పడకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి బీఎల్‌వోల ద్వారా పని సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. పెళ్లిళ్లు అయి చిరునామా మారిన వారిని గుర్తించి వారికి కొత్త చిరునామాలో ఓటు హక్కు కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. చనిపోయిన, వలస వెళ్లిన వారి ఓటు హక్కు నుంచి తొలగించే కార్యక్రమం పకడ్బందీగా జరగాలన్నారు. నిర్మల్ కలెక్టర్ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ ఓటు హక్కుపై చైతన్యం కలిగించేలా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో నిర్మల్, మంచిర్యాల ఆర్డీవోలు, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ అహ్మద్ నదీమ్

కాంగ్రెస్‌లో 'విజయభేరి' ఉత్సాహం !

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాంగ్రెస్ పార్టీలో 'విజయభేరి' సమరోత్సాహం నాయకుల్లో మొదలైంది. ఆదివారం రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులను తరలించేందుకు సన్నద్ధం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఆయా ప్రాంతాల్లో తమ సత్తా చాటేందుకు 'హస్తం' పార్టీ నేతలు ఆరాట పడుతున్నారు. పీసీసీ వ్యూహ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి, ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల నుంచి భారీగా సభకు తరలించేందుకు సన్నద్ధం చేశారు. టికెట్ ఆశిస్తున్న ఆశావహులు సైతం తమ నియోజకవర్గాల నుంచి తమ వంతుగా జనసమీకరణ చేస్తున్నారు. సమన్వయకర్తలు విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నారు. ఒక్కో నాయకుడు ఎన్ని వాహనాల్లో సభకు తరలి వస్తున్నారనేది పక్కాగా తీసుకుని సమన్వయం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇంద్రవెల్లిలో బహిరంగసభ, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పాదయాత్ర, ఆ తర్వాత మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో భారీ సభ నిర్వహించగా వరుసగా సక్సెస్ అయ్యాయి. తాజాగా రాష్ట్ర రాజధాని శివారులో జరుగుతున్న 'విజయభేరి'ని సైతం 'హస్తం' పార్టీ నాయకులు సక్సెస్ చేసేందుకు జనసమీకరణ చేశారు. ఆదివారం ఉదయమే జిల్లా నంచి తరలించేందుకు బస్సులు, కార్లు, రైళ్లగుండా కార్యకర్తలు, అభిమానులను తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు.



చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు
- కేజీబీవీలో న్యాయవిజ్ఞాన సదస్సు

నస్పూర్: నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే.ప్రభాకర్‌రావు అన్నారు. శనివారం పట్టణంలోని కేజీబీవీలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీల ద్వారా గ్రామాల్లో పిల్లల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మొబైల్‌ని మంచికి మాత్రమే వాడాలని, ప్రశ్నించే గుణం అలవర్చుకోవాలని తెలిపారు. ఆపద కాలంలో 100, 1098 టోల్ ఫ్రీ నంబర్లకు డయల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి జి.ఉదయ్‌కుమార్, న్యాయవాది ఎండి.సందాని, ఏసీపీ తిరుపతిరెడ్డి, మంచిర్యాల రూరల్ సీఐ టి.సంజీవ్, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ ప్రవీణ్‌కుమార్, న్యాయవాదులు కే.గంగయ్య, సాగర్, జి.రమణారెడ్డి పాల్గొన్నారు.

దండేపల్లిలో..

దండేపల్లి: న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని చింతపల్లిలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. లక్సెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ అసదుల్లా షరీఫ్, పలువురు న్యాయవాదులు చట్టాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో లక్సెట్టిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, సర్పంచ్ దేవేంద్ర, న్యాయవాదులు రాజేశ్వరరావు, భూమారెడ్డి, శ్రీధర్, సత్తన్న, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని శ్రీశ్రీ నగర్‌కు చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి గొట్టె మల్లయ్య(65) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లయ్య కుటుంబ సభ్యులు, అనారోగ్యం కారణంగా ఈ నెల 13న ఎలుకల మందు తాగాడు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం చనిపోయాడు. ఆయనకు భార్య అనిత, కుమారుడు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

'పెద్దపల్లి పార్లమెంటు స్థానాన్ని మాదిగలకు కేటాయించాలి'

బెల్లంపల్లి: వచ్చే ఎన్నికల్లో బెల్లంపల్లి, చెన్నూర్, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు పెద్దపల్లి పార్లమెంట్ స్థానాన్ని మాదిగలకు కేటాయించాలని ఆలిండియా అంబేద్కర్ సంఘం జాతీయ కార్యదర్శి మామిడిపల్లి బాపయ్య రాజకీయ పక్షాలను డిమాండ్ చేశారు. శనివారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో దాదాపు 2.85 లక్షల మంది మాదిగలు ఉన్నారని తెలిపారు. ఈసారి అన్ని పార్టీలు మాదిగలకు సహకరించాలని కోరారు. వచ్చే నెల 5న గోదావరిఖనిలో మాదిగల ఐక్య వేదిక సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మల్లారపు చిన్న రాజం, ప్రభాకర్, పాపయ్య, సదయ్య, రమేష్, రాజు, శంకర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవు

జన్నారం: ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని డీఆర్‌డీవో శేషాద్రి అన్నారు. డిసెంబర్ 2020 నుంచి మార్చి 2023 వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై 13 సామాజిక తనిఖీలు నిర్వహించారు. శనివారం ఈ తనిఖీలపై ప్రజావేదిక నిర్వహించారు. డీఆర్‌డీవో శేషాద్రి, అదనపు డీఆర్‌డీవో దత్తారాం హాజరయ్యారు. మొత్తం 1086 పనులకు రూ.12.10 కోట్ల వేతనాల రూపంలో రూ.91లక్షలా 70వేలా 243 మెటీరియల్ రూపంలో ఖర్చు చేయగా వీటిపై సామాజిక తనిఖీలు నిర్వహించారు. కొన్ని గ్రామాల ఉపాధి హామీ సిబ్బంది అవకతవకలకు పాల్పడినట్లు తేలింది. వారి నుంచి రికవరీ చేయాలని డీఆర్‌డీవో ఆదేశించారు. ఎంపీపీ మాదాడి సరోజన, జిల్లా విజిలెన్స్ అధికారి సురేశ్, అంబుడ్స్ పర్సన్‌శాఖ అధికారి శివరాం, క్వాలిటీ కంట్రోల్ అధికారి చంద్రశేఖర్, ఎస్టీఎం నరేందర్, ఎస్ఆర్పీ రవి పాల్గొన్నారు.

'బీసీ డిమాండ్లపై కాంగ్రెస్ పార్టీ తీర్మానం చేయాలి'

పాతమంచిర్యాల: హైదరాబాద్‌లో నిర్వహించే సీడబ్ల్యూసీ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ బీసీల డిమాండ్లపై తీర్మానం చేయాలని బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని జన్మభూమినగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బీసీ యాక్టు ఏర్పాటు చేయాలని, స్థానిక సంస్థల్లో 56 శాతం రిజర్వేషన్ అమలు చేసి ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరించాని తెలిపారు. బీసీ ఐక్య వేదిక నాయకులు బోడెంకి మహేష్, ఎం.వెంకటేష్, కొత్తకొండ రమేష్, సురేందర్ పాల్గొన్నారు.

అనుమతి తప్పనిసరి

- నవరాత్రుల్లో అక్రమ విద్యుత్ వినియోగంపై చర్యలు
- కరెంట్ తీగల కింద మండపాలు ఏర్పాటు చేయొద్దు
- విద్యుత్‌శాఖ కంట్రోల్ రూమ్ టోల్‌ఫ్రీ 1912, 7901628369



మంచిర్యాలలో ఏర్పాటు చేసిన మండపం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఎంతో అట్టహాసంగా వెలుగు జిలుగుల్లో వినాయకుడిని పూజించేందుకు వినా యక కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. సెప్టెంబర్ 18 నుంచి 28వరకు వినాయక నవరాత్రి ఉత్సవాలకు నిర్వహకులు సిద్ధమయ్యారు. సోమవారం నుంచి నవరాత్రులు ప్రారంభం కానుండడంతో జిల్లాలో వందల సంఖ్యలో వినాయక మండపాల నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటికే జిల్లాలో కొన్ని చోట్ల మండపాలు సిద్ధం చేసుకోవడంతో పాటు విగ్రహాలను తీసుకొస్తున్నారు. ప్రతీ ఏటా ఉమ్మడి జిల్లాలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపాల ఏర్పాటు, విద్యుత్‌దీపాల అలంకరణ, విగ్రహాల ఊరేగింపు సమయంలో విద్యుత్ ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. ముఖ్యంగా ఈ నవరాత్రి ఉత్సవాలకు 11 రోజుల పాటువిద్యుత్ వాడకం తప్పనిసరి. ఉత్సవ మండపాల వద్ద విద్యుత్ దీపాలు అలంకరించడంతో పాటు మైక్‌లు అమరుస్తున్నారు. నిర్వహకులు తప్పనిసరిగా విద్యుత్‌శాఖ అనుమతి తీసుకోవాలని, విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ శేషారావు సూచిస్తున్నారు. వినాయక మండపాలకు విద్యుత్ సరఫరా కోసం అనుమతి తీసుకోవాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం, ఏదైన ప్రమాదం, తదితర వాటిపై విద్యుత్‌శాఖ కంట్రోల్ రూం టోల్‌ఫ్రీ 1912, 7901628369 ఫిర్యాదు చేయాలని సూచించారు.

తాత్కాలిక చార్జీలు ఇలా..

తాత్కాలిక కనెక్షన్లకు లోడు ఆధారంగా చార్జీలు కిలోవాట్స్ ప్రకారం చెల్లింపు ఉంటుంది. ఏ ప్రాంతంలో మండపం ఏర్పాటు చేస్తున్నారో ఆ ప్రాంత డీఈ పేరుమీద లేదా సెక్షన్ అధికారి పేరు మీద డీడీ చెల్లింపు 1000 వాట్స్‌లోపు రూ.1560, చార్జీ 1000 నుంచి 1500 వాట్స్ వరకు రూ.2300, 1500 నుంచి 2000 వాట్స్ వరకు రూ.3020 చెల్లించాలి. 2000 ఆపై ప్రతి కిలోవాట్‌కు రూ.1560 చొప్పున చెల్లించాలి. డివిజన్ కార్యాలయంలో నేరుగా చెల్లించి రాసీదు పొందవచ్చు. 2కిలోవాట్స్ కంటే ఎక్కువగా అయితే రూ.2800తో పాటు అదనంగా ఒక కిలోవాట్స్‌కు రూ.1560 చెల్లించాలి.

సరిహద్దుల్లో కోడిపందేలు..



జనగామ గ్రామ శివారు కోడిపందేలు

కోటపల్లి: మండలంలోని ప్రాణహిత సరిహద్దు ప్రాంతాల్లో కొడిపందేలు జోరుగా సాగుతున్నాయి. సరిహద్దు గ్రామాలపై పోలీసుల నిఘా లేకపోవడంతో కోడిపందేల వైపు యువత మొగ్గుచూపుతున్నారు. పొలాల అమావాస్య పండుగ సందర్భంగా మండలంలోని సరిహద్దు ప్రాంతాలైన జనగామ, సుపాక శివారులోని పెద్దంచా, ప్రాణహిత నది పరీవాహక ప్రాంతం కోడి పందేలాకు వేదికైంది. కోడిపందేల్లో రూ.5వేల నుంచి రూ.10వేల వరకు పందెం కాస్తున్నారు. కోడిని బట్టి రేట్ నిర్ణయిస్తూ పందేలు కొనసాగిస్తున్నారు. గతంలో పందెం కాస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించినప్పటికీ ఫలితం కానరావడం లేదు. మండలంలోని సుపాక జనగామ శివారు ప్రాంతాల్లోని పెద్దెంచ ప్రాంతం, ప్రాణహిత నది పరిహద్దు ప్రాంతాల్లో పొలాల అమావాస్య రోజున పెద్ద ఎత్తున కోళ్లపందేలు నిర్వహించి సొమ్ముచేసుకున్నట్లు తెలుస్తోంది. కోళ్ల పందేలు మండలంలోని సుపాక, జనగామ, వెంచపల్లి, అలుగామ, చింతలపల్లి, రోయ్యలపల్లి గ్రామాలతో పాటు సరిహద్దులోని మహారాష్ట్రలోని రేగుంట, తేకడా, లాంటి ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున నది పరీవాహక ప్రాంతాలు దాటి కోళ్ల పందేల్లో పాల్గొంటున్నారు. సుపాక, జనగామ గ్రామాల మధ్యలో శివారుల ప్రాంతాల్లో శని, ఆది వారాల్లో నిర్వహిస్తున్న పందేల్లో పెద్ద ఎత్తున పోటీదారులు పాల్గొంటున్నారు. ఇలా గ్రామాల్లో యువత కూడా పెద్ద ఎత్తున పాల్గొని కోళ్ల పందేలు తిలకిస్తున్నారు.

పొలాల అమావాస్యను రాష్ట్ర పండుగగా గుర్తించాలి



వేడుకల్లో పాల్గొన్న నేతకాని కులస్తులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్లలో నేతకాని కులబాంధవుల ఆధ్వర్యంలో పొలాల అమావాస్య ఐదు రోజుల వేడుకల్లో భాగంగా చివరి రోజు శనివారం ర్యాలీ నిర్వహించారు. పొలాల అమావాస్యను రాష్ట్ర పండుగగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతకాని కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పాట్బాల నాగరాజు, ప్రధాన కార్యదర్శి ముడిముడుగుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బెంబడి గురువయ్య, కార్యదర్శి దుర్గం శంకరయ్య, జైపూర్ యువత అధ్యక్షుడు సెగ్గెం సంతోశ్, నస్పూర్ మండల అధ్యక్షుడు రాజం, కోశాధికారి జంబిడి రాములు, ముల్కల్ల నేతకాని సంఘ నాయకులు రమేశ్, కాంతారావు, లక్ష్మణ్, మల్లేశ్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

నవరాత్రుల్లో డీజేకు అనుమతి లేదు

- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు
- డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్



మాట్లాడుతున్న డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్

మంచిర్యాలక్రైం: గణేష్ నవరాత్రుల్లో డీజేకు అనుమతి లేదని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. శనివారం డీసీపీ సమవేశ మందిరంలో వినాయక చవితి, మిలాద్–ఉన్–నబి పండుగలను పురస్కరించుకుని జిల్లాలోని వివిధ మత పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ అని మతాలకు చెందిన ప్రజలు సోదర భావంతో మతాలకతీతంగా ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని సూచించారు. గణేష్ మండపాలు ఏర్పాటు చేసుకునే వారు పోలీస్ అనుమతి తీసుకోవాలని తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, కమిటీ సభ్యుల్లో ఇద్దరు ముగ్గురు మండపాల వద్ద ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు తిరుపతిరెడ్డి, సదయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీలు రాజ్యాధికారం దిశగా సాగాలి



ఐక్యతను చాటుతున్న నాయకులు

నస్పూర్: మంచిర్యాల నియోజకవర్గంలో బీసీలు రాజ్యాధికారం దిశగా ముందుకు సాగాలని బీసీ నాయకులు తెలిపారు. శనివారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్ ఆవరణలో తెలంగాణ బీసీ జాగృతి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నరెడ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలో అధికంగా ఉన్న బీసీలకు ఇప్పటివరకు ఒకే దఫా ఎమ్మెల్యేగా అవకాశం వచ్చిందని తెలిపారు. ఏ ప్రధాన పార్టీ మంచిర్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్‌ను బీసీలకు కేటాయించినా పార్టీలకు అతీతంగా గెలిపించుకుంటామని అన్నారు. లేదంటే తమలో నుంచే ఒకరిని స్వతంత్ర అభ్యర్థిగా నిలబెట్టి గెలిపించుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నస్పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, బీజేపీ నస్పూర్ పట్టణ అధ్యక్షుడు కౌన్సిలర్ అగల్‌డ్యూటి రాజు, నాయకులు డాక్టర్ రఘునందన్, ట్రస్మా నాయకుడు విష్ణువర్ధన్, నాగేశ్వర్‌రావు, రూపాదేవి, గుమ్మడి తిరుపతి, పెట్టం శ్రీనివాస్, రంగు రాజేశం, చుంచు రాజ్‌కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 17 విద్రోహ దినంగా పాటించాలి



మాట్లాడుతున్న మల్లన్న

పాతమంచిర్యాల: సెప్టెంబర్ 17ను విద్రోహదినంగా పాటించాలని అరుణోదయ సమాఖ్య రాష్ట్ర కోశాధికారి మంతెన మల్లన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్క్స్‌భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం నవాబ్ రజకార్లకు వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నాయకత్వంలో పెద్ద ఎత్తున పోరాటం జరిగిందని, ఆ పోరాటంలో నాలుగు వేలకుపైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారన్నారు. కమ్యూనిస్టుల సారథ్యంలో తెలంగాణ వ్యాప్తంగా సాయుధ పోరాటాలను విస్తృతం చేయడంతో తెలంగాణ ప్రాంతం కమ్యూనిస్టుల చేతుల్లోకి పోనుందని నిజాం నవాబ్ నాటి నెహ్రూ, పటేల్ సైన్యం వద్ద లోపాయికారి ఒప్పందంతో తెలంగాణ ప్రాంతాన్ని భారతదేశంలో విలీనం చేశారని గుర్తు చేశారు. 1948 సెప్టెంబర్ 17న ఆపరేషన్ పోలో పోలీస్ చర్య పేరుతో వేలాది మంది పోలీస్, మిలటరీ బలగాలను తెలంగాణలో మోహరించి ప్రజలపై దాడులు చేశారని, మహిళలపై అత్యాచారాలు, వేలాది మంది ప్రజల ప్రాణాలను తీశారని, అలాంటి రోజును విద్రోహ దినంగా జరుపుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీకాంత్, పీవైఎల్ రాష్ట్ర నాయకులు మనోహర్, మేఘన పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెకు సమాయత్తం కావాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సీతారామయ్య

నస్పూర్: కోల్ ఇండియాలోని అధికారుల సంఘం ఢిల్లీ, జబల్పూర్ హైకోర్టులో వేసిన కేసుల్లో కార్మికులకు వ్యతిరేకంగా తీర్పు వస్తే అక్టోబర్ 5,6,7 తేదీల్లో నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు కార్మికులందరూ సమాయత్తం కావాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య పిలుపునిచ్చారు. శనివారం ఎస్ఆర్పీ 3 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. 11వ వేజ్‌బోర్డు అమలుపై కోల్ ఇండియాలోని అధికారులు సంఘం నాయకులు డీపీఈ గైడ్‌లైన్స్‌కు వ్యతిరేకంగా కార్మికుల జీతాలు పెంచారని వెంటనే వాటిని నిలుపుదల చేయాలని కోర్టులలో కేసులు వేశారని తెలిపారు. కోల్ ఇండియాలోని కార్మికులకు సింగరేణి అధికారులకు చెల్లిస్తున్నట్లుగానే అలవెన్సులపై ఇన్‌కంటాక్స్‌ను యాజమాన్యమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా లాబాలా వాటాను 35శాతం చెల్లించాలన్నారు. సమావేశంలో బ్రాంచి కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, బ్రాంచి అసిస్టెంట్ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఏరియా కార్యదర్శి కామెర వేణు, ఫిట్ కార్యదర్శి మురలీచౌదరి, ఉపాధ్యక్షులు అంబాల రవి, నాయకులు మల్లేశ్, నరసింహారావు, అఫ్రోజ్‌ఖాన్, రాచర్ల రవీందర్, సురేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీ ఒకే నాణేనికి బొమ్మాబొరుసు

- మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు



మాట్లాడుతున్న ప్రేమ్‌సాగర్‌రావు

మందమర్రిరూరల్: బీఆర్ఎస్, బీజేపీలు ఒకే నాణేనికి ఉన్న బొమ్మాబొరుసు అని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల స్ట్రాటజీ కమిటీ చైర్మన్ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు విమర్శించారు. శనివారం మందమర్రి పట్టణంలోని ఐఎన్టీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సాధించిన హక్కులు సింగరేణిలో బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్‌లోని తుక్కుగూడలో నిర్వహించే విజయభేరి సభకు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, టీపీసీసీ సభ్యుడు నూకల రమేష్, ఐఎన్టీయూసీ ప్రధాన కార్యదర్శి కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, నాయకులు ఉపేందర్, నీలయ్య, రాంచందర్, లక్ష్మణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల

తుక్కుగూడలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి దుర్గం భాస్కర్ ఆధ్వర్యంలో ఐఎన్టీయూసీ కార్యాలయంలో పోస్టర్లు విడుదల చేశారు.

తుక్కుగూడ సభకు భారీగా తరలిరావాలి

బెల్లంపల్లి: తుక్కుగూడలో ఆదివారం నిర్వహించనున్న కాంగ్రెస్ మహాసభకు భారీగా కార్యకర్తలు, ప్రజలు తరలి రావాలని టీపీసీసీ స్ట్రాటజీ కమిటీ చైర్మన్ కే.ప్రేమ్‌సాగర్‌రావు పిలునిచ్చారు. శనివారం బెల్లంపల్లిలోని పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు కాంగ్రెస్ శ్రేణులు పుర వీధుల్లో మోటారు సైకిళ్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాతరి స్వామి, సూరం రవీందర్‌రెడ్డి, సీహెచ్.శంకర్, ఆర్.శారద, ప్రభాకర్, మల్లేష్, గెల్లి జయరాం, ఎండీ అఫ్జల్, రాజన్న, నయీమ్, కంకటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'వేతన ఒప్పందం సమస్యపై చర్చించాలి'



గనిపై మాట్లాడుతున్న తుమ్మల రాజారెడ్డి

నస్పూర్: సింగరేణి కార్మికుల వేతన ఒప్పంద సమస్యపై త్వరలో జరిగే పార్లమెంటు సమావేశాల్లో చర్చించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. శనివారం ఆయన శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ 1 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులపై కక్షతోనే డీపీఈ నిబంధనలు రూపొందించారని, దాని ఆధారంగానే అధికారుల సంఘం నాయకులు కోర్టుకు వెళ్లారని తెలిపారు. వేతనాల చిచ్చుకు కారణమైన డీపీఈ నిబంధనను ఎత్తి వేయాలని, లేనిపక్షంలో అక్టోబర్ 5, 6, 7వ తేదీల్లో దేశవ్యాప్త సమ్మె చేపడతామన్నారు. డివిజన్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కార్యదర్శి గాదరి భాగ్యరాజ్, గౌరవ అధ్యక్షుడు శంకర్, ఫిట్ సెక్రెటరీ తోడె సుధాకర్, సదానందం, బాలకృష్ణ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

లక్సెట్టిపేట: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు అన్నారు. శనివారం మండలంలోని వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో ప్రజలు పలు రకాల సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని, ఆస్పత్రికి వచ్చిన వారికి సలహాలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో ఫయాజ్‌ఖాన్, వైద్యులు సతీష్‌కుమార్, హెచ్ఈవో లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పాతమంచిర్యాల: వర్షాకాలంలో వాతావరణ మార్పులతో దోమలు, ఈగల వల్ల ప్రజలు వ్యాధుల బారిన పడే ప్రమాదముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

చిరు ధాన్యాల్లో పోషకాలు

మంచిర్యాలఅర్బన్: చిరుధాన్యాల్లో అనేక పోషకాలు ఉంటాయని సమగ్ర శిక్ష కో–ఆర్డినేటర్ చౌదరి అన్నారు. శనివారం జిల్లా సైన్స్ సెంటర్‌లో చిరుధాన్యాలు అద్భుత ఆహారమా..? ఆహార వ్యామోహమా అనే అంశంపై జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించారు. ఇందులో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆదర్శ పాఠశాల మంచిర్యాలకు చెందిన పదోతరగతి విద్యార్థి ఎం.వర్షిత (ప్రథమ), ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల మల్కాపల్లికి చెందిన పదో తరగతి విద్యార్థి సిద్ధు (ద్వితీయ), ఆక్స్‌ఫోర్డ్ పాఠశాల సీసీసీకి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి శరణ్య తృతీయ స్థానం సాధించింది. వర్షిత ఈ నెల 19న జరిగే రాష్ట్రస్థాయి సెమినార్‌లో పాల్గొంటుందని డీఎస్‌వో మధుబాబు తెలిపారు.

ఆరోగ్యశ్రీ కార్డు కోసం ఈ కేవైసీ చేయించాలి



ఆరోగ్యశ్రీకార్డు అందజేస్తున్న అదనపు కలెక్టర్

మంచిర్యాలఅగ్రికల్చర్: తెల్లరేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులు చౌకధరల దుకాణాల వద్ద ఈ కేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకొని ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డు పొందాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. శనివారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో ఈడీఎం సునిల్‌తో కలిసి ఈ కేవైసీ చేసి ఆరోగ్యశ్రీ కార్డును లబ్ధిదారులకు అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసంధానంతో ఆరోగ్యశ్రీ పథకం పరిధి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల పెంచి ఉచితంగా వైద్య సేవలు అందించనుందని తెలిపారు. అన్ని కామన్ సర్వీస్ సెంటర్లలో ఈకేవైసీ చేసుకోవచ్చని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 80 శాతం ఈకేవైసీ పూర్తయిందని, మిగతా లబ్ధిదారులకు ఈ నెల 30 వరకు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ కార్డు కింద అత్యవసర చికిత్సలు, ఊపిరితిత్తులు, కాలేయం, గుండె, కిడ్నీ, న్యూరో సంబంధిత శస్త్రచికిత్సలతోపాటు అనేక వైద్య సేవలు అందిస్తారని తెలిపారు.

వయో వృద్ధుల భద్రత కోసం వాలంటీర్ కమిటీలు

మంచిర్యాలక్రైం: వయో వృద్ధుల భద్రత, సహాయం కోసం రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో 40 వాలంటరీ కమిటీలను ఏర్పాటు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి ఒక ప్రటనలో పేర్కొన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా వృద్ధ తల్లిదండ్రులను పిల్లలు పట్టించుకోకపోవడంతో భద్రత కల్పించేందుకు కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో ఒక ఎన్‌జీవో సభ్యుడు, ప్రభుత్వ కమిటీలో ఏదైనా ఒక దానిలో సభ్యులుగా ఉన్న మహిళా సభ్యురాలు, యూనిఫాం సర్వీస్‌లో పని చేసి పదవీ విరమణ పొందిన వ్యక్తితో కలిపి వాలంటరీ కమిటీలను ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీల విధులు, వివరాలపై గణేష్ నవరాత్రుల తర్వాత సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.